# సుజన రంజని



శ్రీచిత్రభాను ఉగాది ప్రత్యేక
కవితా సంకలనం

# సుజన రంజని

శ్రీచిత్రభాను ఉగాది ప్రత్యేక కవితా సంకలనం

ముఖ్య సంపాదకత్వం
**కిరణ్‌ప్రభ**

# SUJANARANJANI

*A Silicon Andhra Special Issue Commemorating*
*Sri Chitrabhanu Ugadi Kavi Sammelanam - 2002*


*Chief Editor*
**KIRAN PRABHA**
(kiran@kiranprabha.com)

*President*
**Anand Kuchibhotla**
(anand@kuchibhotla.com)

*Secretary*
**Ravi Nyalakonda**
(ravi_desai@qo.com)

*Vice - President*
**Srinivas Cherukupalli**
(nsc@cypress.com)

*Treasurer*
**Suba Garlapati**
(subagarl@yahoo.com)

*Joint Secretary*
**Sarala Nichanamatlu**
(keravani@yahoo.com)

# SiliconAndhra

www.siliconandhra.org

**SUJANARANJANI**

Sri Chitrabhanu
Ugadi Kavisammelanam - 2002
Special Publication

*Chief Editor*

**Kiran Prabha**

*Editorial Board*

**Akkiraju Bhattiprolu**
**Gunda Shiva Charan**

*Cover Design and Illustrations*

**Bali**

*Title Printed at :*

**Charita Graphics**
Hyderabad - 500 020.



*Acknowledgements*

Our Sincere Thanks to :

**Sai Gundavelli**
*President & CEO, Solix Systems*

**Venna Gundavelli**
President & CEO, Emagia Corp.

**Dileep Kondiparti**

**Nisapathi**

**Bali**

'*Rachana*' **Sai**

# సాహితీ సుమసౌరభం

"**తె**లుగు *సాహితీ, సాంస్కృతిక, సంప్రదాయ స్ఫూర్తి... సిలికానాంధ్ర*" - ఈ ఆశయంతో, నినాదంతో ప్రారంభించిన '*సిలికానాంధ్ర*'కిది మూడవ కార్యక్రమం. తొలి కార్యక్రమమైన గరికపాటి నరసింహారావుగారి అష్టావధానంతో సిలికాన్ లోయలోని తెలుగువారి లోగిలిలో 'సిలికానాంధ్ర' మొగ్గ తొడిగింది. మొదటి కార్యక్రమానికే లభించిన అమూల్యమైన ఆదరణ మాపై మరింత కర్తవ్యభారాన్ని పెంచింది. ఒకస్థాయి అభిరుచి కలిగిన కార్యక్రమాలకి ఎక్కడైనా, ఎప్పుడైనా అశేషమైన ఆదరణ ఉంటుందని మరోసారి నిరూపించింది - డిసెంబర్ 22న నిర్వహించిన '*ఆంధ్ర సాంస్కృతికోత్సవం*' పదిన్నర గంటల పాటు సాగిన ఈ నిర్విరామ సాంస్కృతిక కార్యక్రమం సిలికాన్ వేలీలోని తెలుగువారందరికీ ఓ మరపురాని తీపిజ్ఞాపకం. ఆ సందర్భంగా తొలిసారి '*సుజనరంజని*' ప్రత్యేక సంచిక ప్రచురించడం జరిగింది.

ఈ పరంపరంలోని మరో అరుదైన కార్యక్రమమే అమెరికా పశ్చిమతీరంలో మొదటిసారిగా సిలికానాంధ్ర నిర్వహిస్తున్న ఈ '*సాహితీ సదస్సు - కవి సమ్మేళనం*'.

మనసు అట్టడుగు పొరల్లోని ఆలోచనల, అనుభూతుల, విషాదాల, విశ్లేషణలకి అక్షరరూపమే సాహిత్యం. సాహిత్యంలోని ఓ ప్రత్యేక రూపం కవిత్వం. సమాజాన్ని కవిత్వం ప్రభావితం చేస్తుందా, కవిత్వాన్ని సమాజం లొంగదీసుకుంటుందా అన్న చర్చని కాస్సేపు పక్కన పెడితే మనసుని ప్రభావితం చేసే శక్తీ, సామర్థ్యం అక్షరాలకెపుడూ ఉంటాయని మరోసారి నిరూపించాయి. మాకందిన ఈ కవితలు ఈ సాహితీ సుమసౌరభం సిలికాన్ వేలీలో మొదలౌతున్నా, ప్రపంచవ్యాప్తంగా వున్న సాహితీ మిత్రులందరికీ చేరాలన్న ప్రయత్నానికి రూపమే ఈ కవితా సంకలనం.

సిలికానాంధ్ర సమర్పిస్తున్న ఈ '*సుజన రంజని*' కవితా సంకలనం చదివి అనుభూతించే ఆంధ్రులందరికీ సాహితీ విందుభోజనం!

**- కూచిభొట్ల ఆనంద్**
anand@kuchibhotla.com
*అధ్యక్షుడు, సిలికానాంధ్ర*

*క్యుపర్టినో*
*కాలిఫోర్నియా*

# హృదయ స్పందన

*"అనుభవాల్ని ఎగరేసుకుపోతుంది*
*పరుగులిడే కాలవాహిని*
*అనుభూతుల్ని శాశ్వతం చేస్తుంది*
*మనసుని కదిలించే కవితా రసధుని!!"*

జీవితపు విలువల్లో మార్పులొస్తున్నా, జీవన విధానాల్లో వైరుధ్యాలు పెరుగుతున్నా ఆలోచించే మనసు చుట్టూ మాత్రం ఎవ్వరూ అడ్డుగోడలు కట్టలేరు. మనసులో ఆర్ద్రత, ఆవేశం ఉన్నంత కాలం రసాలూరే భావాలకు కొరత ఉండదు. పత్రికల్లో ప్రచురణావకాశాలు తగ్గిపోయినా వెల్లువెత్తుతున్న ప్రసార మాధ్యమాలు మనుషుల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా, మనసు పొరల్లో ఉదయించి, మనసుని వికసింపచేసే కవిత్వానికి ఆదరణ ఎప్పుడూ వుంటుంది. ఇన్ని నిజాలకి నిలువెత్తు సాక్ష్యాలు - ఈ సంపుటిలో చోటుచేసుకున్న కవితా అక్షరసుమాలు!

శ్రీ చిత్రభాను ఉగాది సందర్భంగా అమెరికా దేశం కాలిఫోర్నియా రాష్ట్రంలోని సిలికాన్ వేలీలో 'సాహితీ సదస్సు - కవి సమ్మేళనం' నిర్వహించాలన్న ప్రతిపాదన వచ్చినపుడు, అదే సందర్భంగా ఓ వచన కవితా సంకలనం కూడా ప్రచురించాలన్న ఆలోచన వచ్చింది. మేమందరం కన్నతల్లికీ, ఉన్న వూరికీ వేనవేల మైళ్ళ దూరాన వుంటున్నా మా ఆలోచనలు, జ్ఞాపకాలు తరచూ మనవూరి చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంటాయి. కదిలించే కవితల్ని సేకరించే ప్రయత్నంలో భాగంగా, ఆంధ్రదేశంలో కవితల పోటీ నిర్వహిస్తే సమంజసంగా ఉంటుందని 'రచన' శాయిగారిని సంప్రదించడం ఆయన మాకు కొండంత అండగా నిలిచి ప్రకటనలివ్వడం, ప్రచారం చేయడం చకాచకా జరిగిపోయాయి.

ఈ కవితల పోటీకి వచ్చిన అనూహ్యమైన స్పందన మాకెంతో ఆనందాన్ని కలిగించింది. పోటీకి వచ్చిన వందలాది కవితల్ని తొలి విడతలో వడపోసిన వారు శ్రీ నిశాపతిగారు. తుది నిర్ణయంలో మాకు సహకరించినవారు శ్రీ అక్కిరాజు భట్టిప్రోలు. శ్రీ గుండా శివచరణ్. ఈ పోటీలకు వచ్చిన కవితల్లోని వస్తు వైవిధ్యం మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. కొల్లేటి చల్లగాలి కోసం వలస వచ్చి విలాసాల విందుభోజనాలకి బలైపోతున్న అమాయక పక్షులూ; బోరుబావిలో జారిపడిపోయి అనంతంలో కలిసిపోయిన ఓ చిరుబాల్యం; పాలబుగ్గల పసితనాన్ని పాలరాళ్ళ మెరుగులు కోసం అరగదీసే పని పిల్ల; డాలర్ల వేటలో విచ్ఛిన్నమైపోతున్న అనుబంధాలు; రక్తాన్ని చెమటగా మార్చుకునే రిక్షావాడు; దూరాల తీరాలకు వంతెన వేసే ఉత్తరాలు; 'ఊరుకుంటే సరిపోతుందిలే' అనే నిర్లిప్తత; విస్తరిస్తున్న మౌనాల మధ్య బందీలై పోతున్న జీవిత భాగస్వాములూ - ఎన్నో భావాలూ, ఎన్నెన్నో రూపాలు!!

పోటీలో విజేతలైన కవితలే కాక, మిగిలిన చాలా కవితలు కూడా మనసుకి దగ్గరౌతాయి. దగ్గరై కదిలిస్తాయి. కదిలించి నిలదీస్తాయి. నిలదీసి ప్రశ్నిస్తాయి. ప్రశ్నించి ఆలోచింపచేస్తాయి.

ఇంత చక్కటి, చిక్కటి కవితల్ని అందించిన ఆంధ్రదేశంలోని వచన కవితా రచయిత్రులకే, రచయితలకీ 'సిలికానాంధ్ర' మనసారా శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

పోటీ ప్రకటన దగ్గర్నుంచీ పుస్తక ప్రచురణ వరకూ మమ్మల్ని వెన్ను తట్టి ప్రోత్సహించి, సహకరించిన 'రచన' శాయి గారికి మరోసారి మా కృతజ్ఞతలు. ఈ 'సుజన *రంజని*'కి అర్థవంతమైన భావ స్ఫోరకమైన ముఖచిత్రాన్ని అందించి, కవితలకు 'గీతా'భాష్యం చెప్పిన ప్రముఖ చిత్రకారులు శ్రీ బాలిగారికి మా అభివందనాలు.

భవిష్యత్తుల్లో మరిన్ని మంచి సంకలనాలు మీకందించగలమని ఆశిస్తూ, హామీ ఇస్తూ....

మీ
**కిరణ్‌ప్రభ**
kiran@kiranprabha.com

క్యుపర్టినో
కాలిఫోర్నియా

## ఈ సంకలనంలోని కవితాలంకారికులు


| | | |
|---|---|---|
| ☛ | గెరా | 9 |
| ☛ | ఎస్. మునిసుందరం | 11 |
| ☛ | వై. రామకృష్ణారావు | 13 |
| ☛ | కె. వరలక్ష్మి | 15 |
| ☛ | రాగతి రత్నకుమారి | 17 |
| ☛ | కె.యన్. బాలాజి | 19 |
| ☛ | అమరవాది విష్ణుప్రియ | 21 |
| ☛ | పోడూరి శ్రీనివాసరావు | 23 |
| ☛ | జె. సుబ్బారావు | 25 |
| ☛ | సుమిత్రకుమార్ మొహెంజోదారో | 27 |
| ☛ | సుదేరా | 29 |
| ☛ | చొప్పదండి సుధాకర్ | 31 |
| ☛ | డి. లక్ష్మణాచార్య | 33 |
| ☛ | మందరపు హైమవతి | 34 |
| ☛ | వారణాసి రామకృష్ణ | 36 |
| ☛ | వి. రమాదేవి | 37 |
| ☛ | లంకా వెంకటేశ్వర్లు | 39 |
| ☛ | కోసూరి రవికుమార్ | 41 |
| ☛ | వి. గీతా నాగరాణి | 43 |
| ☛ | యన్.కె. నాగేశ్వరరావు | 44 |
| ☛ | శైలజా రాంషా | 45 |
| ☛ | ఎన్. అనూరాధ | 46 |
| ☛ | సబ్బని లక్ష్మినారాయణ | 48 |
| ☛ | అన్నవరపు శ్రీనాథవర్మ | 49 |
| ☛ | అమెరికా తెలుగు కవుల కవితాసౌరభాలు | 52–69 |




**ప్రథమ బహుమతి (రు. 1,116/-) పొందిన కవిత**

# రాబందుల రెక్కలచప్పుడు



'గెరా' (సికిందాబాద్)

*బహు దూరం నుండి బయలుదేరే ముందు*
*బహుశా మీరిలా ఊహించి ఉందరు!*
*పిడికెడు పొట్ట కోసం*
*వలసపోతున్నామనుకొన్నారేగానీ,*
*పిశాచాల పొట్టల్లోకి*
*పులుసు కాబోతున్నామనుకోలేదు!*
*మంచుపర్వతాలను దాటి*
*మహాత్ముడి రాజ్యానికొస్తున్నామనుకొన్నారేగానీ,*
*రాబందుల మందలకు*
*విందుకాబోతున్నామనుకోలేదు!*
*ఓ సైబీరియా జాతుల్లారా!*
*పరదేశీ బాతుల్లారా!*
*అభయారణ్యాల్లోనూ అడ్డూ ఆపూ లేకుండా*
*సరదాగా వేటాడే "హీరో"లే గానీ*

పక్షి శోకానికే పశ్చాత్తాపం పొందిన
బోయగాళ్ళిక్కడ లేరమ్మా ఇప్పుడు!
మూగజీవుల రక్తం తాగుతూ
మత్తెక్కి తిరుగుతున్న దేవదత్తులేగానీ,
గాయపడిన గువ్వను కాపాడేందుకు
గౌతములెవ్వరూ నేడు రారమ్మా!
ఇక్కడి కాసారాలన్నీ
చిక్కటి సారాయితో నింపుతున్నారు!
ఇక్కడి ఆహారాలన్నీ
చక్కటి విహంగాలతో వండుతున్నారు!
చెట్టంత మనుషుల్నే
పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేస్తున్నచోట;
చెట్టూ పుట్టా పట్టుకు తిరిగే
పిట్టలొక లెక్కా!!
అందుకే
మేఘ సందేశాలు పంపిన దేశం నుండి
ప్రమాద సంకేతాలు పంపిస్తున్నా
రాకండి రాకండి ఈ ప్రదేశాలకు
కొల్లేరును కల్లోలిత ప్రాంతగా ప్రకటిస్తున్నా!!!

*(విదేశాల నుండి చాలా అరుదుగా వచ్చే వలస పక్షుల్ని వేటాడి విందులు చేసుకొంటున్న సంఘటనలకు, అంతరించిపోతున్న అమాయక ప్రాణుల్ని అభయారణ్యాల్లో కూడా చంపి ఆరగిస్తున్న అనాగరిక చర్యలకు స్పందించి...)*





**ద్వితీయ బహుమతి (రు. 500/-) పొందిన కవిత**

# ఏది స్వర్గం? ఏది నరకం?



ఎస్. మునిసుందరం (తిరుపతి)

అక్కడెక్కడో చెట్లకు కాసే రూపాయలు
ఇక్కడ మూడు పూవులారుకాయలవుతాయని
మనసు రెక్కలు విరిచేసి
మూసల చట్రాలలో బిగించి
గానుగెద్దుల్లా తిరగమని శాసించి
'యమసెట్ల' యంత్రాలుగా మలిచి
డిగ్రీల భుజకీర్తులు తగిలించి
విదేశీ గూళ్ళకు బిడ్డలను తరిమేసిన
అమ్మా-నాన్నల బానిస ఆశలు.
తల్లి-తండ్రి-బిడ్డ బంధం డాలరై
ముడి వేసిన రాగబంధం తెగిపోయి
మమత మానవతల బరువును
రూపాయల త్రాసులో తూకం వేస్తూ
రూపాయలతోనే కరచాలనం చేస్తూ

అతుక్కున్న పట్టణాల పేర్లు చప్పరిస్తూ
మనం వెనకబడ్డామని యెద్దేవా చేస్తూ
ఎంత యెత్తో యెదిగిపోయిన భ్రమలో...
జన్మభూమిలో జననీ జనకులు...
ఆశల కొండ చిలువ ఆప్యాయతలు మింగేసినా
నా అన్నవాళ్ళను యెంగిలాకులు చేసినా
తన వారసుల విదేశీ వాసం
ఇక్కడ అమ్మ-నాన్నలకు వొక స్టేటస్
అయితే రూపాయలు మిగిల్చిన ఒంటరితనం
ఆప్యాయంగా అల్లుకుపోని ప్రేమ రాహిత్యం
కంతిరేగి గుండెను తొలుస్తుంటే
ఒక్క ఫోన్ కాల్ కోసం వారం దాకా నిరీక్షణ
మమ్మీ-డాడీ పిలుపు కోసం అనుక్షణ యాతన.
చివరి క్షణాల అసహాయత తలపుకొచ్చి
గుండెలు మృదంగ కర్కశ నాదాలై...
ప్రేమా? పైసలా?
ఏది స్వర్గం? ఏది నరకం?
మార్బల్ గుహలో బిక్కు బిక్కుమంటూ రెండు జీవాలు.

❖ ❖ ❖





**ద్వితీయ బహుమతి (రు. 500/-) పొందిన కవిత**

# వికృత వేదాంతి



వై. రామకృష్ణారావు (హైదరాబాద్)

**వ**సంతమంతా నిద్రించి
వలసపోయే కోయిలల్ని చూస్తాడు,
పచ్చదనం చచ్చిన బీడులో
పహరా కాస్తుంటాడు
వర్షం చిందులేసే వేళ
శీర్షాన్ని అలమరాల్లో దాచి
వట్టిపోయిన మబ్బుల కోసం
కిటికీ రెక్కలు తెరుస్తాడు.
సరిత్తులు సవ్వడిగా సాగిపోతుంటే
రాయిలా ఘనీభవించి
ఇసుక మేటల్లో
జండా కొయ్యలు పాతుతాడు
శిశూదయంనాడు
సీమాంతరాలను దాటిపోయి

వల్లకాటి దిక్కుకు
వడివడిగా తిరిగి వస్తాడు
ప్రతి సౌందర్యం నశించిపోయేదే అంటూ
ప్రబోధించే వికృత వేదాంతి వాడు -
విరిగిపోయిన నెత్తురు ప్రవహించే
విషమ తాత్త్వికుడు వాడు-
ఆశల దీపాంకురాలను ఆర్పివేసే
అశాంతి పవనం వాడు -
నైరాశ్యం రూపుదాల్చి వాడి గుండె
అస్తమయంలోని సంధ్య
ఎప్పటికీ
సూర్యుణ్ణి ప్రసవించలేని వంధ్య !

❖ ❖ ❖





**తృతీయ బహుమతి (రు. 250/-) పొందిన కవిత**

# జాలి (?)



కె. వరలక్ష్మి (జగ్గంపేట)

అయ్యో అమ్మా నాన్నా లేరా నీకు?
చిరుప్రాయంలోనే అనాథ బాలికవా?
అయినా ఆరడి పడుకులే
అన్నీ మేమే అనుకో
ఆకలి దిగులొద్దు - అడుగున మిగిలిందంతా నీకే
పాపాయి పాత గౌన్లూ
పనికిరాని రిబ్బను ముక్కలూ అన్నీ నీవే
చీకటితోటే లేచేసి - చిట్టిపాపకు నీళ్లోసి
ఇంటిని అద్దంలా ఊడ్చేసి
ఆ చేత్తోటే అంట్లన్నీ తోమెయ్
మా పాప మరీ మృదువైనది
మంచినీళ్ళు కూడా నువ్వే తాపాలి
బండెడు పుస్తకాలు మోసే బలం లేదు
బరువంతా నువ్వే మొయ్యాలి

ఎండా వానా అనుకుండా
ఎక్కడికైనా వెళ్లిరావాలి
పాపాయి పక్కన సోఫాల మీదెక్కి కూర్చోబోకేం
అయ్యగారికి కోపం వచ్చిందంటే
అసలు మనిషే కాడు
ఆయన చిటిక వేస్తే
నువ్వు అడుగులకి మడుగులొత్తాలి
మా గొంతులోని మాట వెలువడకముందే
నీ చేతిలోని పని పూర్తి కావాలి
దీనంగా దిగులుగా ఉండబోకేం
భయం లేదు భయం లేదు నీకు
అనుసరించి అణుకువగా నడుచుకుంటే
అన్నీ మేమే నీకు -

❖ ❖ ❖





**తృతీయ బహుమతి (రు. 250/-) పొందిన కవిత**

# మహాప్రస్థానంలో జవాబులు రా(లే)ని ప్రశ్నలు



రాగతి రత్నకుమారి (విశాఖపట్నం)

కొడుకా! కులదీపమా! బంగరుకొండా!!!
ఆ బోరు బావికేమి తెలుసురా?
ఈ కార్పొరేషను గోతులకేమి తెలుసురా?
కన్నా!! కన్నమనసుల కడుపుకోత
జీవుడు పైకెగిరినంక కదురా లోకంల
పూడ్చడానికి గుంతలు తవ్వేది? మరేందిరా యిది
ఇక్కడ్నేమొ నిన్ను, అక్కడ్నేమొ రాంచంద్రయ్యని
బతికుండంగనే, పాతాళలోకాన పాతిపెట్టేరేందిరా నాయినా
కొడుకా- కంటిలో దీపమా!!!
కంటికి కానరాని ఈ పాకుడు మెట్లేందిరా?
కొడుకా! బంగారు కొండా!
పెద్దల్లో కలసి వీరుడవయినావురా
నాకైతే సొరగం వుందో, నరకం వుందో

తెల్దుగాని బిడ్డా
పాతాళలోకమొకటుందని, నువ్వు పడ్డ
బోరుబావిల తొంగిచూసినంక
తెలిసిందిరా కన్నా- నా కంటిపాపా!!
లెక్కల్లో బాగా వెనుకపడ్డావని టీచరమ్మంటే
సక్కంగ సదువుకోరా, పైకి రారా నాయినా అని నేను
బతిమిలాడితే, బాగా సదూకుంటానమ్మా
అంటూ, అయిదుల్లోనే వందల్లెక్కెట్టేసినవా?
నిప్పుల కుంపటి నా కడుపుల రాజేసినవా కొడుకా?
బడికెళ్తే బాగుపడ్తవని నే పంపితే
నీ బతుకునే నిలువు తాటి లోతున పాతిందిరా ఈ లోకం
సదూకుని సక్కంగుండమని నే దీవిస్తే
(నా) నీ తలరాత సజీవ సమాధిలోకి నడిపిందిరా
కొడుకా కొండల మధ్య దీపమైనావురా
మా గుండెల గునపాన్ని గుచ్చినావురా బిడ్డా
నీ చావు "కాలధర్మం" కాదని
అన్యాయమని, అధర్మమని ఎవరిని అడుగను కొడుకా?
విధి నడగనా? విధాత నడగనా?
నిలదీసి నిలబెట్టి అడుగుదారంటే
ఆ'మిత్తి'కి 'సడి'లేదు
ఈ 'దేవుడికి' జా(లే)డే" లేదు
కొడుకా! కోనేటిరాయా
ఈ కడుపుకోతకు మందునేదురా!

❖ ❖ ❖





**తృతీయ బహుమతి (రు. 250/-) పొందిన కవిత**

# చలన సూత్రాలు



కె.ఎస్. బాలాజీ (పలమనేరు)

కాసిన్ని అక్షరాలే కావచ్చు
కాగితం గరుగ్గానే ఉండొచ్చు
అయినా
ఉత్తరం ప్రతిసారి
నన్ను ప్రేమగా స్పర్శిస్తుంది

❖ ❖ ❖

విసుగొచ్చిన క్షణాలు
అలసిపోయిన సమయాలు
ఓడిపోయిన బాధల్లోంచి
ఉత్తరం
అమ్మలా నన్ను ఓదారుస్తుంది

❖ ❖ ❖

అంతటా బిగుసుకుపోయినతనంలోంచీ

మూత పెట్టిన మాయతనంలోంచి
మనల్ని మనం కోల్పోతున్నతనంలోంచి
ఉత్తరం నన్ను మిత్రుడిలా ఆదుకుంటుంది

❖ ❖ ❖

ఎప్పుడైనా - ఎక్కడైనా
కాసిన్ని అక్షరాలే కదా
మనిషికి కొత్త ఊపిరులు

❖ ❖ ❖

కాలం, వేగం, దూరాలే కాదు
ఉత్తరాలు కూడా
జీవితానికి చలనసూత్రాలే!

❖ ❖ ❖





**తృతీయ బహుమతి (రు. 250/-) పొందిన కవిత**

# మోక్షేచ అతిచరామి



అమరవాది విష్ణుప్రియ (ముథోలు)

జీవితాంతం ఎవరూ తోడు నిలువరు
చివరి వరకు తోడుగా వుండేది జీవితమే!
చీకటిని వెలుగుగా చూడు
అప్పుడు నిన్నే చీకటి దరిచేరదు!
జీవితమనే ఆటలో వెలుగునీడలు ప్రత్యర్థులు
చీకటిని వెలుగుగా ; వెలుగును చీకటిగా భావించినప్పుడు
నిన్నే బాధలు దరిచేరవు!

★ ★ ★

ఎవరూ ఎవరిని అనుసరించి వెళ్ళరు!
ఎవరూ ఎవరిని అనుసరించి రారు!!
జీవితం ఒకే ఒక బాట కాదు
వేల వేల త్రోవలు
ఏదో ఒక మార్గంలో కొంతదూరం వరకు

ఎవరో ఒకరు తోడుగా వస్తారు
పద్మవ్యూహంలాంటి ఆ త్రోవలో
ఎక్కడో ఒకచోట మనల్ని దారి తప్పిస్తారు
మనం ఎంత ప్రయత్నించినా ఆ దారి మనకు దొరకదు
తప్పినదారిలోంచి మనం, ఒంటరిగా పయనిస్తున్నప్పుడు
ఎక్కడినుంచో మనల్ని చూస్తూ వెక్కిరిస్తారో?
మన బాధల్ని చూసి నవ్వుకుంటారో?
మనం తెలియని అయోమయంలో
ఉక్కిరి బిక్కిరై విలపిస్తున్నప్పుడు
గమ్యాన్ని చేర్చే దారి కోసం అన్వేషిస్తున్నప్పుడు
జీవితమే ఏదో ఒక దారి చూపిస్తుంది.
అదే ఏడిపిస్తుంది, అదే ఓదారుస్తుంది!
ధైర్యం కోల్పోతామా? భయపెడుతుంది!
ఎదురు నిలుస్తామా? పారిపోతుంది!

★ ★ ★

అయినా చివరి వరకూ తోడుగా వుండేది జీవితం!
జీవితాంతం ఎవరూ తోడుగా ఉండరు!!

★ ★ ★





# మహిళ మనోగతం



పోడూరి శ్రీనివాసరావు (భువనేశ్వర్)

అనుకోని ఘోరం మరోమారు జరిగిపోయింది
కాదనుకుంటూనే మళ్లీ తల్లినయ్యాను.
చూద్దాం! ఈసారైనా వంశోద్ధారకుడుదయిస్తాడేమో?
ఇపుడో సౌకర్యం ఉందిగా!
పురాణ కాలమైతే దివ్యదృష్టి
ఈ నవీనకాలంలో - స్కానింగ్ దృష్టి
పరీక్ష చేయించాను - ఫలితం మామూలే
మళ్ళా - ఆ...... డ........పి.........ల్లే.......
మొదలయ్యాయి మావారి రుసరుసలు
ఆపైన అత్తగారి చిటపటలు
ఆ రాత్రి అబార్షన్‌కై భర్తగారి అర్థింపు - ఆపైన బెదిరింపు
చివరగా బ్రహ్మాస్త్రం కూడా ప్రయోగించారు.
నీవల్ల లాభం లేదు - మరోపెళ్లికి నే సిద్ధమంటూ
ఈసారైనా అదృష్టం పరీక్షించుకుంటారట
సుపుత్రుడు లేకపోతే వంశమే లేదట!
ఆ రాత్రల్లా నిద్దుర కరవయ్యింది నాకు
మాగన్ను పడుతూండగా
ఎదురుగా వచ్చింది అదృశ్యరూపం
మెల్లమెల్లగా రూపుదాల్చింది

ఎదురుగా వచ్చింది అదృశ్యరూపం
మెల్లమెల్లగా రూపుదాల్చింది
పొట్టి, పట్టు లంగాతో నా చిట్టితల్లి
ఏమ్మా! నేను నీ కూతురిగా పుట్టడం తప్పా?
ప్రస్తుతం నీ కడుపులోంచే చూస్తున్నా
ఈ అందమైన భూప్రపంచం
నేనీభూమిపై కాలుపెట్టకూడదా?
బుజ్జి బుజ్జి తువ్వాయిలతో
రంగురంగుల పువ్వులతో
కిచకిచలాడే పక్షులతో
నీతో, అక్కతో, అందరితో
ఆటలాడకూడదా?
నేను చేసిన పాపమేమిటమ్మా?
ఏం సమాధానం చెప్పాలి?
ఇదే పరిస్థితి పాతికేళ్ళ క్రితం
నా తల్లికి గూడా ఎదురయ్యుంటే
ఈనాడు నేను భూమి మీద నిలబడేదాన్నా?
ఈ పరిస్థితి నెదుర్కొనే దాన్నా?
తరాలు మారినా - స్త్రీ తలరాతలు మారలేదు
స్త్రీకి - స్త్రీయే శత్రువుగా మారుతున్న
నేటి సమాజంలో
ఓ అత్త - తన కోడల్ని
ఆడపిల్లను కన్నందుకు
ఏడుకట్ల సవారిపై
ఊరేగింపుకు సిద్ధం చేస్తున్న
ఈ అ'సభ్య' సమాజంలో
మార్పు రావాలంటే
స్త్రీ తలరాతలు మారాలంటే -
తలపుల్లో రావాలి పరివర్తన!
ధృఢంగా నిర్ణయించుకున్నాను
ఆడైనా, మగైనా ఈ సంతానాన్ని కనాలని
తయారు చెయ్యాలి నా చిన్న తల్లిని
మరో ఇందిరలా.... కిరణ్‌బేడీలా...... కరణం మల్లేశ్వరిలా.......

❖ ❖ ❖





ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

# రిక్షావాడు



జె. సుబ్బారావు (హైదాబాద్)

అరిగిపోతున్న అరికాళ్ళకు సానబెట్టి
ఆయుధంగా వాడతాడు
ఇంకిపోతున్న రక్తపు చుక్కలను కూడగట్టి
ఇంధనంగా ఉపయోగిస్తాడు.
ఆకలి కేకలను నోటిలో చుట్టపీకగా వెలిగించి
తరుముకొస్తున్న దరిద్రాన్ని తలకుపాగాలా చుట్టుకొని
ఆఘమేఘాల మీద వచ్చిన బస్సు వైపు
ఆశగా
అతని ప్రాణం బేరాల కోసం చూస్తుంది!
నరాలను అరగదీసి
తన 'గుర్రం' మీద ఎంత స్వారీ చేసినా
కండలను కరిగించి
మండుటెండలో ఎంత చెమట చిందించినా
ఆదాయం అతనికి వట్టిమాటే!

ఆకలి మాత్రం నిత్యం వెంటే!!
పగలూ రేయీ లేదు
పండుగ సరదాలు లేవు
పైసా సంపాదన కోసం పరుగులాటే!
సమ్మర్ వెకేషన్స్ లేవు
సేదదీర్చే లోకేషన్స్ లేవు
పట్టెడు మెతుకుల కోసం వెతుకులాటే!!!
హవాలా కేసులతో లావాదేవీలు లేనివాడు
కలర్ టీవీల కుంభకోణంతో సంబంధం లేనివాడు
అతనికి తెలిసిందల్లా ఒక్కటే
అదే!
కాయకష్టం చేయడం
కడుపు నింపుకోవడం
ఆశలన్నీ అడియాసలవుతున్నా ఆగిపోక
నిస్సత్తువ ఆవరిస్తున్నా నీరుగారిపోక
జీవన సమరాన్ని సాగిస్తూ...
బ్రతుకు బండిని లాగుతూ..
రిక్షావాడు!
కష్టాల కొలనులో కమలమై విరుస్తాడు!
స్వేదాల వేదంలో మంత్రమై నిలుస్తాడు!!

❖ ❖ ❖





**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# వాడు పాటకు మాతృక



సుమిత్ర కుమార్ మోహన్ముదారో (పంమనేరు)

వాడు భాషకు బూజు దులుపుతాడు
భావానికి శస్త్రచికిత్స చేస్తాడు
వాడి కళ్లలో ఆకాశం పువ్వులా విచ్చుకుంటుంది
వాడి నులివెచ్చని నవ్వుల్లో పక్షుల కిలకిలారావాలు..
వాడి ఊపిరిలో జీవనదుల ఉరకలు...
వాడు అక్షరాలకు జీవం పోసి ప్రాణప్రతిష్ఠ చేస్తాడు
వాడు అక్షరాలను చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాల్లా పేర్చి
వాటికి ఆచంద్రతారార్కమంత
చిరంజీవత్వం ఇస్తాడు.
అక్షరాలకు 'అవధూతతత్వం' ఇచ్చి
జ్ఞానానికి పట్టం కడతాడు
వాడు అపుడే పుట్టిన అక్షరాలను రక్తంతో కడిగి

కన్నీళ్ళలో ముంచి ఉరికొయ్యకు గుడ్డలా ఆరేస్తాడు
వాడు భాషకు అనంతత్వమిస్తాడు.
ఇంతా చేసి తృప్తిదీరక
అక్షరం అనాధ అవుతుందని
ఒకనాడు వాడే ఉరికొయ్యకు వేలాడతాడు.
తన పనిని మరొకరికిచ్చి, తన ధర్మాన్ని ప్రజలకిచ్చి
తీర్పు కాలానికి వదిలి
వాడు వెదురు పొదల మధ్యగా
చావులమదుం మీదుగా వెర్రిగా గాలిలా వీచుకుంటూ
వేణువుకు ప్రాణం పోస్తాడు.
వాడు మనిషి మాత్రమే కాదు!
వాడు ఓ ప్రజాగీతానికి మాతృక! ఓ ఉద్యమానికి ఊపిరి!
జీవితం సమరశీలం! అందుకే వాడు పోరాటానికి రంగస్థలం!
అవున్నిజం! వాడు అమలిన ఆనందానికి ఆమ్లజని!

❖ ❖ ❖





**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# నిమిత్తమాత్రులు



సుదేరా (విశాఖపట్నం)

ఈ భూగోళంపై గళమాత్రులమైన మాకు
జీవితమంటే జవాబులేని ప్రశ్న
చికిత్సకి లొంగని చిరకాలరుగ్మత!
నియంతల నిర్వసంత పంజరాల పెంజీకటుల్ని పెకలించుకొచ్చి
నిన్నటిదాకా మా భుజాలెక్కి బజారులో ఊరేగిన ఇజాలే
నేడు ఊబిలో తొక్కబడుతున్నాయి ఉద్యమదీప్తిగా!
దేవుడిపేర దశాబ్దాలుగా ఆడబడుతోన్న గారడీలో
మొన్నటివరకూ మాచే మొక్కించుకున్న మతాలన్నీ
నేడు ముక్కలైపోతున్నాయి మానవత్వం సాక్షిగా!
మెదడుకి మెదడుకి మధ్య పెరిగిపోతున్న వివాదపు అగాథం
ఉగ్రవాదమై దేశదేశాల ఆశయాల్ని మసిచేసేస్తున్నది దావాగ్నిగా!
హెరాయిన్లకి, సెలయిన్లకి నెలవైన మా దేహాల్లో కాలుష్యం నెత్తురై వెల్లువెత్తుతూ
అనంతవాయువీవనల్లో అల్లల్లాడే ఆయువుతో అలుపెరుగని సంఘర్షణ సాగిస్తున్నది
అణుతోరణమై ఆలింగనం చేసుకోబోయే మరణాన్ని తృణీకరించిన విజ్ఞాన వేశ్య
ఆకలి ఊహల మధ్య అకాల గర్భస్రావాలకై చిట్కాల కంప్యూటరు చిట్టాలో మీటలు

నొక్కుకుంటున్నది
పిడికెడు కాంక్షకై ఖడ్గాల కౌగిలిలో క్షణక్షణం పెనుగులాడుతూ
రుణాల తోరణాలు కొనుక్కొనేవాళ్ళు భౌమ్యస్వేదాన్ని వ్యోమనౌకల్లో నింపి
అంతర్‌గ్రహ సీమల్లో కల్లాపిగా చల్లేస్తున్నారు
శతకోటి శాపఘాతాల పరమైన శరీరాన్ని వీర్యోత్ప్రేరకాల కలల్లో తేలిస్తూ
దవడల కింద నలిగే కూలిమెతుకుల్ని మూతుల్లోంచీ లాక్కొని
లోహగ్రస్త కార్ఖానాల్లో బట్టీచితుల్లో బొగ్గులుగా కూరుతున్నవాళ్ళు
ప్రకృతి కనుగుడ్లు చిదిమి బంగారుగుడ్లు దోచెయ్యచూస్తున్నారు
ఇంటర్నెట్ పారిభాషిక సంకేతాల్నే ఇంటిపేర్లుగా ధరిస్తూ
సైబర్ గుహల్లో గూబలై రహస్యైనిక పాతర్లని పాడుగుతూ
రూపాయి నోట్ల రిమోట్ల మీద రెప్పపాటు కాపురాలు చేస్తూ
గెలలు గెలలుగా క్లోనీకరించిన శీలాల్ని ఫ్యాషన్‌షోల శూలాల్తో వేటాడుతూ
ఛానళ్ళ చాళ్ళలో చెల్లెళ్ళ నెత్తురునే గెత్తాలుగా చల్లేస్తున్నారు.
యాంటిన్నాల కొండాలతో, యాంత్రిక తంత్రుల కోరలతో
గ్లోబుని వొడిసిపట్టుకున్న వాణిజ్య అమీబా విసర్జిస్తోన్న కూటఫలాలు
మా కడుపు కడలిలో కదిలే బహుళజాతి ఓడలై
మా పేగుల గనుల్ని పెకలించుకుపోయే రాకాసి పలుగులై
మా వినమ్ర దేహద్వీపాలపై పరాయి పతాకాలను విత్తుతున్నాయి
ఆదిముడి సమాధిపై ఆకాశమెత్తు ఎదిగిన ఆధునికులం
నేడు అన్యాక్రాంతులమై విలపిస్తున్నాం....
మా కలల్ని, కిలకిలల్ని, ఎవరో వెలివేస్తున్నారు!
మా ఆశల్ని, ఆప్యాయతల్ని ఎవరో శాసిస్తున్నారు!
అందుకే..... సంక్షోభకాంక్షితుల మధ్య స్వేచ్ఛ జీవచ్ఛవేచ్ఛగా
దర్జాదర్పాల కల్పిత కిరీటాల మధ్య లజ్జాపూరిత మచ్చగా
హాహాకారాల హారాలను మోస్తూ అసువులు బాస్తున్నది!!

❖ ❖ ❖





**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# చూపులేని సంగీతం



చొప్పదండి సుధాకర్ (సిద్దిపేట)

**వా**డు రాగం ఎత్తుకుంటాడు
ఎక్కడెక్కడో తిరిగే హృదయాలను
ఏకతాటిపైకి తీసుకొస్తాడు
సంగీతం తెలియదు, శాస్త్రం తెలియదు
పాట వెంటే సంగీతం, శాస్త్రం
లాక్కెళ్ళి పోవడం తెలుసు
చేతులు ఆడించడం, గొంతును పాడించటం
వాడికి ఆకలితో పెట్టిన విద్య
వాడి పాటకు అందరూ పరవశిస్తారు
కాళ్ళూ చేతులనే కళ్ళుగా చేసుకొని
బస్సంతా కలియ తిరుగుతూ
మనల్ని కాసేపు ఆలోచింపజేస్తాడు!
అన్నీ ఉన్నా ఏమీ చేయని
కొంతమంది పోరంబోకు గాళ్ళకు

వాడొక కొరడా దెబ్బ!
వినుక్కునేవారు వినుక్కున్నా
తలలూపే వారు తలలూపినా
వాడికి పట్టింపులేదు
నాభిలోంచి పుట్టిన రాగం
నాభిమంట చల్లారిస్తే చాలును!
కఠిన హృదయాలను కాసేపు ఆహ్లాదపరచి
కదుల్తోన్న బస్‌లోంచి వాడు దిగిపోతాడు
పాతికో పరకో సంపాదించి
అంగవైకల్యాన్ని వెక్కిరిస్తూ
అజేయుడిననే నిరూపించుకొంటాడు
దృశ్యాన్ని చెరిపేస్తూ కండక్టర్ తలుపు బిగిస్తే
బస్ కదుల్తుంది, వాడూ కదుల్తాడు
మరో బస్‌లోకి...!
క్రమేపి మన హృదయాంతరాళాల్లోకి....!!

(సిద్దిపేట బస్టాండ్‌లో నిత్యం బిచ్చమెత్తుకొనే ఓ అంధ బిచ్చగాడికి అంకితం)

❖ ❖ ❖





**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# అమ్మ జ్ఞాపకం



ఓ. లక్ష్మణాచార్య (హైదరాబాద్)

ఇంటికి పంపే ఆ బడి గంట
తరగతి గదిలో నా గుండెలో
ఎంత సంతోషాన్ని నింపేదో!
గాలిలో తన ఇష్టం వచ్చినట్లు ఎగిరే
మూడు రంగుల జెండాకున్నంత ఉత్సాహం
నా పాదాల్లో వచ్చి చేరేది
బడి నుండి సరాసరి ఇంటి వెనుక చేన్లోకి -
అక్కడ అమ్మ - పెసరచెట్ల వరుసల మధ్య
వనదేవతలా
దొరికిన కొద్ది సమయాన్ని కూడా
సద్వినియోగం చేస్తూ
అమ్మ చేతుల కదలికల్లోని జీవానికి
రూపం ఇస్తేనే ‘చైతన్యం’ అంటాన్నేను;
ప్రతీ చెట్టుకూ ప్రాణప్రతిష్ఠ చేసే
ఆమె మనోసంకల్పాన్నే ‘హరితం’ అంటాన్నేను;
నేల వాలిన తీగను పైకెత్తి దానిపై
పువ్వుల నవ్వుల్ని పండించే
జీవకారుణ్యాన్నే ‘విప్లవం’ అంటాన్నేను

❖ ❖ ❖

**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# హైటెక్ బస్సు



మందరపు హైమవతి (విజయవాడ)

బిగించి కట్టిన మూటలా
నల్లని అద్దాలతో
నలువేపులా మూసేసి
నిస్తేజంగా నీరవంగా
ఎత్తైన కుషన్ సీట్లతో
ఎవరికివారే ఏకాంతసౌధం
పక్కపక్కనే వున్నా
నడుమ మొలచిన
నిలువెత్తు నిశ్శబ్ద కుడ్యం

❖ ❖ ❖

నాగరికత వడిసెల రాళ్ళకు
ఎగిరిపోయిన మాటల పిట్టలు
సరిహద్దు తగాదాల
శత్రురాజ్య సైనికుల్లా
ఒరలోనుంచి దూసిన మౌనఖడ్గాలు





నలువైపుల నుంచి దుండగులు
ఒక్కసారిగా దండెత్తినట్లు
కమ్ముకున్న ఒంటరితనం

❖ ❖ ❖

అట్టడుగు పొరలో
అణచిపెట్టబడిన దుఃఖం
శివజటాజూటం నుండి
ముంచెత్తిన గంగవెల్లువ
ఆకస్మిక వరద కన్నీరు
కళ్ళ పడవలను ముంచేసినా
పక్కవాళ్ళకుక్కూడా తెలీదు
ఉధృతి తగ్గినాక
గుక్క తిప్పుకున్నాక
పాటల సీతాకోకచిలుక
ఒకటి వచ్చి వాలుతుంది మనసుపై
తలవాల్చే మిత్రభుజంలా
కిటికీలోంచి చల్లగాలి కెరటం!

❖ ❖ ❖

# ఆఖరి యత్నం



వారణాసి రామకృష్ణ (హైదరాబాద్)

సాహితీ సూదిపెట్టి పొడిచినా
చలనం లేదు!
కవిత్వపు కొరడాతో కొట్టినా
కదలిక లేదు!
వ్యంగ్యాస్త్రాలెన్ని విసిరినా
ఖాతరు లేదు!
మొద్దుబారిపోయింది!
హద్దుమీరిపోయింది!
చెల్లాచెదురయిన చిరునామాతో
గల్లంతయిన గమ్యంతో
చేవ చచ్చి చేష్టలుడిగి
చావురేవుకి చేరువలో
దోవ తప్పిన సమాజం!
నవ నాగరీకపు ప్రపంచం!!

❖ ❖ ❖





# ఉత్తిష్ఠ



వి. రమాదేవి (రాజోలు)

అమ్మా! అన్నయ్య కొడుతున్నాడు
అబ్బా! పితూరీలు చెప్పకు, ఊరుకో!
అమ్మా! పక్కింటి రాము నా బంతి తీసుకున్నాడు
పోతే పోయిందిలే వాడితో దెబ్బలాడలేవు
ఇంకోటి కొనిస్తాను, ఊరుకో!
మాష్టారూ, ఈ లెక్క రాకుండా విసిగించేస్తోంది
ఏదీ నన్ను చూడనీ, ఊఁ! రేపు చెప్తాలే
ఇవాల్టికి ఊరుకో!
నాన్నా నేను ఫస్టు క్లాసులో పాసయ్యాను
ఆ, చాల్లే బడాయి అంత ఎగిరిపడకు ఊరుకో!
ఈ కాలేజీలో సీటు న్యాయంగా నాకు రావాలి
డొనేషను ఎక్కువ కట్టాడని వాడికిచ్చారు
పోనీలేరా, ఇంకో కాలేజీలో ట్రై చేద్దాము ఊరుకో!
ఆఫీసులో నాకు రావాల్సిన ప్రమోషను

వాడు కొట్టేసాడు హై రెకమండేషనుతో
ఏం చేస్తాం సోదరా, రూల్సుకు తావులేదిక్కడ ఊరుకో!
ఇంకా అయిదేళ్ళ సర్వీసుంది
విఆర్ఎస్ చేతిలో పెట్టారేమిటి?
అర్థం కాలేదా సార్! ఇంటికెళ్ళమని
అన్యాయమని అరుస్తున్న గొంతును నొక్కేసాను 'ఊరుకో' తో!
సంతోషంతో ఎగిరే మనస్సు
కోపంతో వుడికిపోయిన శరీరం
దుఃఖంతో తల్లడిల్లిన చిన్ని మది
ఉత్సాహంతో ఊపిరి తీయబోయిన నా ఉనికిని
కట్టిపడేసింది సంఘం ఉత్తమోత్తమ స్థితి
అంటూ 'ఊరుకో' తో!
కానీ -
మాయాలోకపు తెరలన్నీ జారిపోయే వేళ
సహస్ర బాహువులతో నరికేసాను 'ఊరుకో' రాక్షసిని!
గ్రహించాను ఉత్తిష్ఠ మంత్రాన్ని
షడ్గుణ సంపత్తుల దీపపు వెలుగే ఉత్తిష్ఠని
కరదీపికగా అందిస్తాను ముందు తరాలకి
ఎలుగెత్తి చాటుతాను పాఠాలుగా ముందు జన్మలో!

❖ ❖ ❖





**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# కాలం ఒడుపు తప్పుతోంది



లంకా వెంకటేశ్వర్లు (కానుమోలు)

**కా**లం చేజారనీకు
కర్తవ్యం కన్నీరై పారిపోనీకు
క్షణం విత్తు నుంచి పుట్టిన
కాల వృక్షాన్ని కౌగిలిలో బంధించు
నిరంతరం పరుగులీసే క్షణాల్ని
బలవంతంగానైనా అనుభవించు
ప్రతిక్షణం విల్లు విడిచిన బాణం
ప్రవాహమెపుడూ వెనుదిరిగి ప్రవహించదు.
సహస్రాబ్దాల చరిత్రను
నిశ్శబ్దంగా పీల్చుకున్న నింగి వృక్షానికి
తల్లివేరు కాలం
ప్రపంచం ప్రమిదలోంచి
కాలజ్ఞానం గల మనిషి
బొట్టు బొట్టుగా కాలాన్ని పీల్చుకుంటాడు
మహాకాంతిమయ స్వర్ణ కిరీటాన్ని

శిరస్సున ధరిస్తాడు
అతడే తన కాలానికి కాంతి చెట్టవుతాడు
తన తరువాత కాలానికి కాంతి బీజమవుతాడు
కాలం మూలం కారల్ మార్క్సుకు తెలుసు
నిలువెల్లా కాలమై విశ్వమంతా విస్తరించిన
ఫ్రాయిడ్‌లు డార్విన్‌లు గాంధీలు మండేలాలు
కాలానికి ప్రతీకలు కలకాలం పతాకలు
ఒక్కొక్కరు ఓ మహాప్రవక్త
కాలం ఏ కన్నీటికీ కరగదు
ఏ కారణానికీ కదలదు.
ఒడుపు తెలియనపుడు కాలం కత్తై
ప్రయోగించిన వాణ్ణే బలి తీసుకుంటుంది
భవిష్యత్తును కిందికి లాగి
గతంలోకి తొక్కేస్తుంది
ఒడుపు తప్పిన కాలం రెండో ప్రపంచ యుద్ధమైంది
ఈ ప్రైవేటీకృత గ్లోబలైజేషన్ కూడా
తప్పకుండా  ఒడుపు తప్పుతుందా?!
విషరసాయన కాసారం పర్యావరణం
ప్రభుత్వాలు పిల్ల బాతుల్లా ఈదులాడుతున్నయ్
ఎయిడ్స్ వేరు పురుగుతో
పత్రహరితం హరించుకుపోతోంది
కాగితాలపై జీవోలు పచ్చదనం ప్రకటిస్తున్నయ్
ప్రజల చెవుల్లో ప్లాస్టిక్ పువ్వులు మొలుస్తున్నయ్
ఒడుపు తప్పుతున్న అదుపు తప్పుతున్న
కాలం చేసే అకాల వికృత విన్యాసాల
రేపటి విరాట్ స్వరూపానికిది
నేటి రిహార్సల్స్..... కాదా!

❖ ❖ ❖





**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# నువ్వా.... ప్రశ్నా.....



కోసూరి రవికుమార్ (దాచేపల్లి)

విస్తరిస్తున్న మౌనాల మధ్యనుంచి
విచ్చుకోవాలని ప్రయత్నిస్తున్న ఓ సౌగంధికాపుష్పం
నీకూ నాకూ మధ్య......
అనావిష్కృతంగా వున్న ఎన్నో
ఆలోచనా శిధిలాల నిగ్గుతేల్చేందుకో..
నిశ్శబ్దపు డైనమైట్...
నువ్వు ప్రశ్నవి కాలేనపుడు,
నేను సమాధానమవటం చాలా కష్టం నేస్తం
నిన్ను శిల్పం చేసుకునే ప్రయత్నంలో
నేను వులి కాలేకపోతున్నానేమో... అనుమానం!
నిన్నకూ..... నేటికీ మధ్య
మనం ఫలించి "మరో జీవి"త మయ్యాం తప్ప
ఎన్ని క్షణాల్ని కలసి ఆనందించామో
లెక్కించుకుందామా?

కుటుంబాలు.... కుటుంబాలై
భయానికి వెళ్ళడం తప్ప.. ఎన్నిసార్లు
పండగలయ్యాయో, సంబరాలయ్యాయో
మామిడి తోరణాలయ్యాయో
బేరీజు వేసుకుందామా....!?
ఏంచేస్తాం... ఏనుగు మీదెక్కినా
అంబారీలో వాడికీ... అంకుశం పుచ్చుకున్నవాడికీ
తేడానే కదా.....
నాకిపుడు కొత్తగా జీవితాన్ని మొదలుపెట్టాలని ఉంది
ఆత్రేయ పాటల్ని పాత టేప్‌రికార్డరులోంచి
చెవుల్లోకి వంపుకోవాలని ఉంది
పురికొసకట్టిన మల్లెదండల్లోంచి
నాల్గు చేతుల్తో కొబ్బరి బోండాల్ని కొలవాలని వుంది
కనీసం మిద్దె మీద వెన్నెట్లో
తినలేక వదిలేసిన మిఠాయి పొట్లం కావాలని ఉంది
కుంకుమ పువ్వునేం చేసుకోవాలో తెలీనంత
అమాయకులం కావాలని ఉంది
రాత్రిళ్ళు కళ్ళతో మెలకువను కొలవాలని ఉంది
మళ్ళీ మనుషుల్లా బతకాలని ఉంది...
నువ్వు ప్రశ్నవి కానంతకాలం
నేను సమాధానాన్ని కావటం... కష్టం నేస్తం
కేవలం జీవించటం తప్ప
బతకటం కుదరదు నేస్తం......

❖ ❖ ❖





**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# అహం బ్రహ్మాస్మి



వి. గీతానాగరాణి (హైదరాబాద్)

భావజాల అనుభూతిలో
రకరకాల రూపురేఖలు
కొన్ని స్పష్టంగా మరెన్నో అస్పష్టంగా
ఏ సాహిత్య సాంప్రదాయాలూ
వర్ణించలేని భావ పరంపరలు
రూపకల్పనల కన్నా
విలక్షణమైన మనోభావ చిత్రాలు
కొన్ని స్పష్టంగా మరెన్నో అస్పష్టంగా
బాహ్య ప్రపంచాన్నంతా
నాలో ఇముడ్చుకోవాలనే తపన
ఎంత పొరపాటు ఆలోచన?
అక్షరబద్ధం చేద్దామంటే గవాక్షాలుండవు
సరససంభాషణా చాతుర్యాలుండవు
ముద్దలా ఘనీభవించిన శూన్యం తప్ప
మనోరంగస్థలం మీదున్న
చిత్ర విచిత్రాలను తీసివేస్తూనే
అలంకారాలు లేని
శుద్ధ చైతన్యం దర్శనమిస్తుంది
స్పష్టంగా..
సంకల్పవికల్పాల రహిత స్థితే నేను!

❖ ❖ ❖

# హైకూలు



యస్.కె. నాగేశ్వరరావు (పెనుగొండ)

చెరువు నీటిలో
కొబ్బరి చెట్టు
అంతర్ముఖ బింబం

రైలు వెళ్ళిపోయింది
పట్టాల మీద విస్తరించిన
బాల్యం ఐదు పైసల బిళ్ళ

చేలో వరినాట్లు
రైతు కళ్ళల్లో
కుప్ప నూర్పిళ్ళు

బస్సు కిటికీలోంచి
చూడబోతే
చెట్లు వెనక్కి పోతాయేం?!

కోతలు పూర్తయిన చేను
పిట్టల సందడి లేదు
అంతా పరిగలేరే పిల్లలే

ఎండాకాలం
డాబా మీద పడక
ప్లస్ వెన్నెల స్నానం

ధవళేశ్వరం ఆనకట్ట వద్ద
అన్నపూర్ణమ్మ విగ్రహం
కాటన్ దొరే

'ఆ' అక్షరం
నా కళ్ళకెప్పుడూ
పాలిచ్చే తల్లే

చిలక్కొయ్యకు గొడుగుకర్ర
చనిపోయిన
నాన్న జ్ఞాపకం

❖ ❖ ❖





# ఒంటరి వల



శైలజ రాంషా (హైదరాబాద్)

ఇరుగు పొరుగు ఇంటర్నెట్‌లోనే
అమ్మ, అక్క అవసరం లేదు
నాన్న, అన్న అసలే వద్దు
ఫాదర్స్ - డేలు, మదర్స్ - డేలు, ఈ-మెయిల్‌లోనే,
జత కుదిరేది, జంట ఒంటరయ్యేది ఈ - కామర్స్‌తోనే,
తలుపు తియ్యకుండా, నోరు విప్పకుండా
సర్వసుఖాలు తన ముంగిటికి రప్పించుకొంటున్న
మరో సహస్రాబ్ది మానవుడా!
ఈ ఒంటరి వల బిగిసాక,
శ్వాస నిలిచాక, గుండె చప్పుడు ఆగాక
అప్పుడేం చేస్తావు!

❖ ❖ ❖

**ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత**

# అధి వాస్తవం



ఎన్. అనూరాధ (విజయవాడ)

**న**డి 'మే' ఎండ, కురవనని మారాంచేసే నల్లమబ్బు
ఎట్నుంచో తోసుకొచ్చే ఈదురుగాలి!
నువ్వూ, నేనూ, ఈ వేసవి సాయంకాలం!
జాజిపందిరి ఒంటరి తీగెని వరండా అంచుకి ఆహ్వానిస్తే
తీగెలు తీగెలై సాగి డాబానంటి నిశ్శబ్దంగా పల్కరిస్తుంది!
ఇప్పుడిప్పుడు ప్రశ్నలు మొదలవుతున్నాయి.
కళ్ళు ఆవిష్కరించే దృశ్యాలు నిజాలేనా?
నువ్వూ నేనూ వాస్తవమేనా?
ప్రేమకి భాష్యం వెతుక్కునే మనం
అంతలోనే మనమధ్య సరిహద్దులు గీస్తాం





అస్సలే దాటవద్దని ఎల్లలు కడతాం
రోజువారీ పరుగుల్లో
నువ్వెవరో, నేనెవరో!
అనుక్షణం తీరికలేని బ్రతుకులమైపోతాం!
ఏ చిన్న(?) దుఃఖానికో
చివుక్కుమన్న మనస్సుతో పరస్పరం కావలించుకుంటాం!
క్షణం గడిస్తే -
మళ్ళీ...... మనం, నువ్వే నేనైన వాళ్ళం!
నువ్వూ నేనూగా విడిపోతాం!
చూస్తున్నావా ఈ విపరీతం?
అందుకే నీకంటే నాకంటే
ఆ కురవని నల్లమబ్బూ, జాజితీగే
అవి......... అవి వాస్తవం!
నువ్వూ నేనూ అంటావా?
అధివాస్తవం!

❖ ❖ ❖

# ఆమె



సబ్బని లక్ష్మీనారాయణ (కరీంనగర్)

**ఆమె**

మంచుకురిసిన హేమంతం
గడ్డిపరకల్లోని తుషార మౌక్తికం
రాత్రిని పొగొట్టుకున్న జ్ఞాపకాల
తొలిపొద్దు సింధూరపు దేవకాంత!
అడుగులన్ని బరువులై తడబడిన
ధవళ నేత్ర జ్వలిత మునికాంత!
ఒత్తిల్లిన మేని సౌందర్యాలన్ని కుంకుమ పువ్వుల్లా
గుబాళించుకొని మయూరిలా నాట్యమాడే వనజాత!
జ్ఞాపకాల మాటున దాగుకొని
మైమరచి పరుగులిడే లేడిపిల్ల!
వెన్నెల నవ్వులన్నీ ఈ లోకంలో పారేసుకున్న
నవరసాల నవ్వుల రాణి!

❖ ❖ ❖





# వసంతరాగం.......!



అన్నవరపు శ్రీనాథవర్మ (విజయవాడ)

గున్నమామి గుబురులోన
కలికి చిలుక గోరువంక
గుసగుసలు..... పులకింతలు....
కొమ్మ రెమ్మల కోయిలమ్మ..... కుహూ కుహూ రాగాలు.....
మధుమాసపు శుభోదయమిది....
వసంతాలు కురిసిన శుభక్షణమిది.....!
చైత్రమాసపు ఎలకోయిల గానం...
లతలకు పొంకమై తరులకు బింకమై.......
కీరవాణి రాగమై.... పలికింది.....!
వన మయూరి నాట్యమాడింది....
మామిచివురుల తోరణాల స్వాగతంతో...
ఋతురాజం...... ఆరుదెంచింది....!
జాజిమల్లె మాలతులతో వసంతం....
మధురోహలల్లిన కొత్త భావం
విరులు విప్పారి పూసిన లలిత ప్రేమారావం...

మౌనివలెనున్న రాచిలుక మాటనేర్చిన వైనం....
ఇది వసంతోదయం...
మధుమాసపు మహోదయం....!
ప్రకృతికి నిండు పుష్పాంజలుల నీరాజనం...
వసంతపు గంధాన్ని చెంపలకు పులుముకుని
ముత్తైదువై చిగురించింది..... గున్నమావి...!
ఆకుపచ్చ ఆహ్లాదం అలసి సొమ్మసిల్లింది......
ప్రకృతి అరమోడ్పు కనులతో పరవశించింది..!
నవవసంత పవనానికి గడ్డిసైతం ... చిమ్ముకొస్తుంది... పువ్వులా..
ఊహాగానంలో పల్లవించే పంచమంలా..
గిరులలో... ఝురులలో పూల సరులలో
శ్యామల సస్యక్షేత్రాలను ఊయల లూగిస్తూ...
గుక్కెడు వసంతాన్ని తాగి....
చిగురు పాటపాడింది కోయిలమ్మ....
చిరుమల్లె సొగసు రేకులను తట్టిలేపుతుంది..
పూచే చిగురాకు కోసమా...
నవ వసంతపు వలపు పాట కోసమా.....?!
పచ్చులు ముసిరిన మధువనం.... రంగుల్ని పిండుతుంది..
కొమ్మలు వేణువులై... స్వరాల పరిమళాలు కురుస్తున్నాయి....!
ఈ అనుభూతి అక్షరాల వసంతగీతమౌతుంది.
పూల సితారు తీగలపై...... ఒక రాగఝురి
..... వసంతరాగం పలుకుతుంది...!

❖ ❖ ❖





# అమెరికా తెలుగు కవుల కవితాసౌరభాలు


| | | |
|---|---|---|
| ☛ | మారేపల్లి వెంకటశాస్త్రి | 52 |
| ☛ | చంద్ర కన్నెగంటి | 54 |
| ☛ | తమ్మినేని యదుకుల భూషణ్ | 56 |
| ☛ | కె.వి.యస్. రామారావు | 58 |
| ☛ | అపర్ణ మునుకుట్ల గునుపూడి | 60 |
| ☛ | కె.వి. గిరిధరరావు | 62 |
| ☛ | మాచిరాజు సావిత్రి | 64 |
| ☛ | శివచరణ్ | 67 |
| ☛ | మల్లిక్ బులుసు | 69 |

# చిత్ర భానోదయం




మారేపల్లి వెంకటశాస్త్రి

వెలుగునీడల మధ్య వెన్నంటి వేటాడి
కష్టసుఖములన్ని కలసి నడచే
అష్టకష్టంబులెదురయ్యె మాకు
ఇష్టసంపదనిమ్ము చిత్రభానూ

మాయలెన్నో చేసి, మమతలెన్నో పెంచి
యంత్రాంగమై నిలిచి, తంత్రాంగమై మారె మాయదారి
దురితదుష్టముతోడ, దుర్గతి తొలగించి
దూరదృష్టిని పెంపు చిత్రభానూ

తనువునే మరిపించి, తలపు రేపే రీతి
మనసునూపివేసె, మత్తు జగతిలోన
చిన్నపిల్లలు చేయు పనులుగా తలపోసి
కరుణజూపగరమ్ము చిత్రభాను





నీరాకకై మే మెదురెదురు జూచె
ఇక్కట్లు తొలగించి, ఈడేర్చు మాతల్లి
క్రొత్త ఫలముతో నీవు క్రొంగ్రొత్తగా వచ్చి
పంచాంగమై మెరెసె, చిత్రభానూ

శనిరాజుగా నిలిచె, కవి మంత్రిగా నుండె
సస్యాధిపతి, మా కంగారకుండయ్యె
ధాన్యాధిపతి చూడ చంద్రుడయ్యుండ
చిత్రఫలముల నోము, చిత్రభానూ

బుధుల కధిపతిగ బుధుడు నిల్చుండ
బుద్ధి చెప్పగవచ్చె, బోధకుండు
గురువు చూడగ మేము, రసాధిపతుడై
ఘనగణాంకుడు, శుక్రుడే చిత్రభాను

రాహుకేతువు జూడ రాజీకి వచ్చె
రాజ్యసభలలో నింక రగడ ఏలా?
చలనచిత్రములలో సిరి, వెన్నెలై వెలిగే
సీతారాముని దెచ్చె చిత్రభానూ

❖ ❖ ❖

# అపరాధం



చంద్ర కన్నెగంటి

మచ్చలేని వొళ్ళంతా మెలికలు
తిరిగి
మలినపరిచే చూపుల్ని
మరులుగొన్న మనసుని
మరలించుకోలేని దోషం నాదే
పిన్నతనపు గాలిబుడగలు
పగలగొట్టి
తేటకన్నుల ఎర్రజీరల
కలతనిండగ
అడుగు తడబడ గూడు
విడవగ
తళుకుతారల పూలబాటల





మాయమాటల
ఆశల నిచ్చెన జార్చిన ఏమార్చిన
ద్రోహం నాదే
విరగబూచిన యవ్వనాల
రాత్రిరాత్రికి తనివితీరగా
తీయతేనియ పీల్చి తాగి
సారహీనగ మిగిలించిన
మోహం నాదే మోసం నాదే
పంటలన్నీ అందుకునే ఆత్రంలో
జాలిలేని తోటమాలిని
కలల పిట్టల పారదోలిన పాపం నాదే కపటం నాదే

కరుకుదేలిన కోమలత్వం
రాటుతేలిన సౌకుమార్యం
రంగులు మాసిన బొమ్మగ మార్చిన నేరం నాదే
వెలిసిపోయిన కంటి జిలుగులు
వడలిపోయిన మేనిమినుకులు
తప్పు నీపై తోసివేచిన తప్పు నాదే.

❖ ❖ ❖

# స్థావరం



తమ్మినేని యదుకుల భూషణ్

ముకురంలో నెమరేస్తూ
ముకుతాడు వేయని ఎద్దు
ముకుళించిన పూలు
ముఖం నిండా రంగు

శిశిరాగ్ని
విపినాన్ని
దహించి వేస్తుంది
కృశించి నిలిచిన
ఈ పత్ర దేహం





పొడవని డావిన్స్ ఈ పటం
వేడినీలం వెలి పావడా
తడిమి చూడని శిల్పం
నీడనివ్వదు ప్రియురాలు

ఒకటే గుర్రం
ఒకడే రౌతు
సకలమూ
శకలమూ
నికరంగా వెన్నెల

భవనంలో
నివసిస్తుందా ఆత్మ?
పవళించిన పడక మీద
ఎవరితో ఎవరు

ఏ రహస్య స్థా
వరాల్లో కలిశారు?

✦ ✦ ✦

# ఆదాయం ఆరు - వ్యయం పదహారు




కె.వి.యస్. రామారావు

అప్పులు తెచ్చుకున్న ఆవేశంతో
వార్తాహరులు గొంతు చించుకుని ఘోషిస్తున్నారు
చిరునవ్వుల మేకప్‌లు పులుముకుని
వాల్‌స్ట్రీట్ వేదాంతులు భాష్యిస్తున్నారు

ఎకానమి ఎదుగుదలకి అప్పుడే
ముచ్చటగా మూడో నెల వచ్చిందట!
ఇంకెంత - ఆరేడు మాసాల్లో
ఐశ్వర్యపు శిశువు అవతరిస్తున్నాట్ట!!

ఇది శాస్త్రోక్తంగా జరిగిందో లేదో
యిప్పుడిప్పుడే చెప్పలేం
ఈ జ్యోతిష్కులు వసారాల్లో మరో ఫలితం దాచారేమో
అప్పటిదాకా చిక్కుముడి విప్పలేం





ప్రస్తుతానికి మాత్రం -
వంతులు వేసుకుని వాంతులు చేసుకుంటున్న
కార్పొరేషన్ల కాళ్ళు ముందుకు కదలటం లేదు
పంతంగా దినదినాభివృద్ధిని సాధిస్తున్న
నష్టాల నాజియా ఎప్పటికీ వదలటం లేదు

జనం చరాస్తుల తోకల్లుంచి
సున్నాల ఉల్కలు ఊడిపడుతున్నాయి
బేంక్ ఎకౌంటుల బేలెన్సులు
ఆస్తి నాస్తి విచికిత్సా హేతువులౌతున్నాయి

నీలాకాశ మార్గాన ఎగిరిన
నిన్నటి ధగధగల తారాజువ్వలు
నిరుద్యోగపు ఎడారుల్లో రాలిన
నేటి భుగభుగల బొగ్గురవ్వలు

ఎన్‌రాన్‌మెంటల్ హాస్పిటళ్ళలో
డాక్టర్లంతా రోగులుగా తర్జుమా
ఐపివో తిరణాళ్ళ రోడ్ల నిండా
చాప్టర్ లెవన్ వరదల పరంపర

తరుగుతున్న ఇళ్ళ వేల్యూల గోడ దెబ్బకి
పెరుగుతున్న ప్రాపర్టీ టేక్సుల చెంపదెబ్బ తోడు
అంతుకనపడని స్టాక్‌మార్కెట్ పద్మవ్యూహంలో
అందరూ అభిమన్యులై తిరుగుతున్నారు చూడు

ఐతే మన ప్రభుత్వం వారి ఉవాచ
కనిపించే కష్టాలు కలగా గ్రహించ
ఓపిక భారాన్ని కొన్నాళ్ళు ఓపిగ్గా భరించు!
ఉన్నదంతా ఖర్చుపెడితేనే నీకు సుఖాల స్వర్గం లభించు!!

❖ ❖ ❖

# ఆ ఉత్తరం ఇ(E) ఉత్తరం



అపర్ణ మునుకుట్ల గునుపూడి

అందమైన అనుభవాలు
ఆనందపు అనుభూతులు
అంతులేని భావాలు
అమృతంపు వాక్యాలు
ఆపేక్షగ కలబోసిన
అవతరించు ఆ ఉత్తరం

ఇలలో ఎటునుండైన
ఇంపుగ చిటికెలో
ఇరుముక్కలు కొట్టి
ఇదిగో పంపిస్తానంటూ
ఇబ్బందితో పడవేసిన
ఇమ్ముగ పుట్టును E ఉత్తరం





ఆశతో ఎదురుచూచు అమ్మలు, నాన్నలు
చిలిపిగ చిందువేయు అక్కలు, తమ్ములు
విరివిగ విశేషాలు కోరు వీధివారు వాడ వారి
అల్లారు ముద్దు పట్టి ఆ ఉత్తరం

ఎదురు చూచు వారు లేరు
వచ్చెనని గంట కొట్టినను
తెరచి ఆహ్వానించువారు లేరు
వందలలో వొకటిగ పడియుండు E ఉత్తరం

దాచుకుని మరిమరి చూచుకుని
చూసినది మరిమరి చదువుకుని
ఊహల ఉయ్యాలలో సరసమ్ముగ
విహరింపజేయు నా ఉత్తరం

ఎట్టకేలకు తెరచి చూచి
విడి ముక్కలు పొడి వాక్యాలు
వింత భాషా ప్రయోగ వాహినిగ
విసరికొట్టబడు E ఉత్తరం

అందుకున్న ఆనందం
ఆప్యాయత వాక్యాలు
మురిపమ్ముగ ముచ్చటల
తిరుగబోయు... నా ఉత్తరం

అకటా! ఇవియేమి చోద్యము
పది వాక్యముల మించి యున్న
చదువుట కాలయాపన సుమ్మ
యని ఈసడింప దను E ఉత్తరం

❖ ❖ ❖

# పావురాల వాన



కె.వి. గిరిధరరావు

**అ**ప్రకటిత యుద్ధం అంతం కాలేదు
అవిశ్వాస ప్రకటన అవాస్తవం కాదు
అపరచిత నీడలకు ఆహ్వానం లేదు
అపరిష్కృత వాదాలకు వాయిదాలు లేవు

మాసిపోని ఎర్ర జీరల మెరుపులు
కళ్ళ మీద దాడులు చేస్తూనే వున్నాయి
సద్దుమణగని ఇనుప రెక్కల చప్పుళ్ళు
ఊరు గుండెల్లో దడలు పుట్టిస్తూనే వున్నాయి
తేలిపోని బాంబులు కురిసే మబ్బులు
దేశం శిరస్సుపైన గాయాలు చేస్తూనే వున్నాయి

నువ్వూ నేను యుద్ధాన్ని కోరుకోవడం లేదు
ప్రక్క వూళ్ళో నీ స్నేహితుడూ,
నా స్నేహితుని స్నేహితుడూ యుద్ధంలో
క్షతగాత్రులను చూసి నీకు లాగ నాకు లాగా
విలపిస్తున్నారు
అవిశ్వాస గీతికల్ని స్రవిస్తున్నారు.





ఇక్కడకొచ్చి పడ్డప్పుడు నువ్వూ నేను అపరిచితులమే
వేల వేల వత్సరాల పరుగు తర్వాత
అడవిలోంచి బయటపడి
ఆటవికతనానికి నాగరికతలు పులుముకుని
నీ కండలని నా గుండెనూ
నా తెలివిని నీ జ్ఞానాన్ని
త్రాసుల్లో తూచుకుని బేరీజు వేసుకుని
కనిపించిన మేర కంచెలు కట్టుకున్నాం
ఎదురుపడ్డప్పుడల్లా కాలు దువ్వుకున్నాం

ఎవడు నమ్మింది వాడికి వేదం
వేదం కాకపోతే వాడు నమ్మి పూజించే దైవం
ఎవడి వేదనలు వాడివి
కాకపోతే వాటిల్లోంచీ సృష్టించే వాదనలు మాత్రం అందరివి
ఎన్ని వాయిదాలు పడ్డా తీరే తగవు కాదిది
అయినా వాయిదాలలో తీరేవి ఋణాలు కానీ రణాలు కావు!

ఆశయాలు ఛిద్రమైనంత మాత్రాన
ఆశలు చావాలనీ లేదు
కళ్ళు కనిపించనంత మాత్రాన
కలలు కనగూడదనీ లేదు

అందుకే -

ఎర్రబడ్డ నదీనదాలు, వాగులూ
తెల్ల పావురాలను ఎగరేసి
ఇరుకు గదుల బతుకుల్లో,
కనిపించని కాపలా చువ్వల నడుమ
కలత నిద్రలో జోగుతున్న జీవితాల్లో
వెన్నెల వానలు కురిపించాలి
నువ్వూ నేనూ
మనకు తెలియని మన పొరుగూరి జనం
అందరం కలిసి ఆనంద నృత్యం చేయాలి

❖ ❖ ❖

# చేదెక్కిన గారెలు



మాచిరాజు సావిత్రి

వీసా రాగానే రెక్కలు కట్టుకున్నట్టు
విమానంలో అమెరికా చేరగానే
అమాంతం ఇంగ్లీషు సినిమాలో దూరిపోయినట్టు
అనిర్వచనీయమైన అనుభూతి
కొత్తగా, వింతగా, మత్తుగా, మధురంగా
ఎన్నడూ చూడని దృశ్యాలూ,
ఎన్నడూ వినని శబ్దాలూ
కిటకిటలాడే జనం లేకుండా
విశాలంగా ఉండే రహదార్లు
వందలకొద్దీ కార్లున్నా
వినిపించని హారన్ల విన్యాసాలు

ముటముటలాడే మొహాలు
ముడుచుకున్న నుదుళ్ళూ
వెక్కిరించే ముక్కులూ





విరుచుకునే మూతులూ
బదులు
చిరునవ్వులతో, పకపకలతో
కళకళలాడే ముఖబింబాలు
మర్యాదలతో, మన్ననలతో
ఆదరించే వ్యాపారులు

వెన్నెలలా చల్లగా
మల్లెల్లా కమ్మగా
స్వచ్ఛమైన పాలలా
ప్రశాంతంగా, నిర్మలంగా
సాగిపోయింది జీవితం!!

ఈ గులాబీల పాన్పులో
అప్పుడప్పుడొక చిన్న ముల్లు
మనవాళ్ళు ఇంకొంతమందుంటే
ఎంత బాగుండును? అని!!!

కాలాలు సాగాయి
బదిలీలు వచ్చాయి
రోజులు మారాయి

చిరపరిచితమైన దృశ్యాలూ,
మరిచిపోయిన శబ్దాలూ,
మళ్ళీ సాక్షాత్కరించాయి
కూరల బజార్లలో తొక్కిసలాటలూ
భోజనశాలల్లో దెబ్బలాటలూ
శనివారం సినిమా తెద్దామని వెళ్తే
వీడియో షాపు నిండా జనాలూ
అరుపులూ, కేకలూ పలుగొంతుల్లో
కబుర్లూ, తిట్లూ పలు బాషల్లో
విసురులూ, విమర్శలూ చుట్టూ మనుషుల్లో
మనవాళ్ళే కదా ఏంచేస్తారన్న ధీమా

చిరునవ్వులెందుకు? మర్యాదలెందుకు?
సహకారమెందుకు? ఉపకారమెందుకు?
అవన్నీ ఇక్కడి వాళ్ళకు కోటా
మనవాళ్ళకక్కరలేదన్న భ్రమ
తెల్లని కాగితం మీద
నల్ల సిరా మరకలా
నిండు చందమామలో
వ్యాపించిన మచ్చలా
తీయని పానకంలో
సారంలేని పుడకలా
కమ్మని ముద్ద పప్పులో
పంటి కింద రాయిలా
కుదుపులతో, ఒడిదుడుకులతో
కుంటుతోంది జీవితం
అస్తవ్యస్థమైన మనసులో
అప్పుడప్పుడొక భావం -
అణుచుకుందామనుకున్నా ఆగనిది
మనవాళ్లు ఇంతమందుండకపోతే
ఎంత బాగుండును? అని!!!

❖ ❖ ❖





# నేనూ సైనికుడినే



శివచరణ్

విజ్ఞానం వేటలో
సౌకర్యాల దాహంలో
ధనసముపార్జనా సమ్మోహనంలో
దూరతీరాలను చేరి
ఉభయసంధ్యల మధ్య
పరుగుపందెంగా మారి
సరిహద్దు గస్తీ సైనికుడి నిరంతర కవాతులా
విరామమెరుగని జీవితం అలిసిన క్షణాన
ఉనికినే ప్రశ్నిస్తూ ఉదయించిన ప్రశ్నలన్నీ
సాంస్కృతిక పునరుజ్జీవన ప్రక్రియకు బీజాలుగా మారతాయి
పెరిగే పిల్లలు సంధించే శరపరంపరకు
సాంస్కృతిక కవచం అవసరం అవుతుంది.
విలువల వలువలకై కలవరింపు మొదలవుతుంది.
ప్రపంచానికి ప్రవచనాలు పంచిన
పుణ్యభూమి వైపు దృష్టి సారింపబడుతుంది.
మాన్యులైన మన మహర్షుల నుండి
మాలిన్యం నిండిన నేటి నాయకుల దాకా

పరమత సహనం నిండిన సనాతన ధర్మం నుండి
పరహితమీడిన నవతరం వరకూ
సకల వర్ణ దేశ చిత్రపటం ఆవిష్కరింపబడుతుంది.
భవిష్యప్రణాళికలో భాగంగా
మనసులోని ఆలోచనలకు అనుగుణంగా
దేశ సౌభాగ్యాన్ని చిత్రించడానికి
నూతన చైతన్యం కుంచెగా మారుతుంది.
సామాజిక సంస్థలుగా పరివర్తనం చెందుతుంది.
పసిడి రెక్కలు ముక్కలు చేసుకునే
పసిపిల్లల బాల్యంగా మారుతుంది.
ఆదరణ కరువైన అరుదైన కళలకు
ఆయువుగా అవతరిస్తుంది.
అనాధ బాలుని అధరంపై
చిరునవ్వుగా చేరుతుంది.
భారతీయతలేని నాయకత్వంపై
నాయకత్వంలేని భారతీయతపై
యుద్ధం ప్రకటిస్తుంది.
ఉత్తిష్ఠత, జాగృత, ప్రాప్యవరాన్నిభోధత
అంటూ
కర్తవ్య ప్రభోధంలో మనసు
వివేకానందమవుతుంది.
నా దేశ సాంస్కృతిక పరిరక్షణా బాధ్యతలో
పరిశ్రమిస్తూ
పరితపిస్తున్న
నేనూ
ఒక సైనికుడినే!

❖ ❖ ❖





# ఉగాది



మల్లిక్ బుడుసు

అరువది షడృతు చక్రాల కాలరథం
మరో శిశిర శిఖరాన్ని దాటేసింది
ప్రభవ విభవాది తెలుగు వర్షాల మాల్యం
మళ్ళీ వసంతాన్ని మనకిచ్చింది

చిగురించే మావి పూతల శ్వేతదనం
కనువింపుగ తోరణం గట్టింది
కోకిల కూతలలోని మాధుర్యం
క్రొత్త ఉగాదికి సన్నాహం పలికింది

పండిత పరిగణిత భవిష్య ఫలం
పంచాంగశ్రవణమై జాగ్రత్తలు తెలిపింది
కవి సమ్మేళనాల్లోని భాషామృతం
అష్టావధానపు జల్లులుగా కురిసింది

ఉగాది పచ్చడిలోని నవ రుచి మిశ్రమం
కష్టసుఖాలకు నిదర్శనంగా అద్దం పట్టింది
మైత్రీయం ఒసంగే మన సంస్కృతి ఔన్నత్యం
విశ్వశాంతికై నిరంతరం కృషి చేస్తోంది

❖ ❖ ❖